31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం, సెప్టెంబర్ 19, 2026 పేజీలు : 8

## జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా అనంతుల రమేష్ నియామకం



**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 18 :** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అనంతుల రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం శుక్రవారం నగరంలోని క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన డిసిసి అధ్యక్షుని తోపాటు కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ...నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జిల్లా మంత్రులకు, ముఖ్య నేతలకు, ప్రజా ప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు వాస్తవాలతో తిప్పికొడతానని, కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు నా వంతు కృషి చేస్తూ, నూతన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తాను అని అన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను
# పకడ్బందీగా నిర్వహించాలి

- నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలి
- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల/కోరుట్ల, సెప్టెంబర్ 18:** ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కోరుట్ల మున్సి పల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులు, వాటిపై నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పూర్తి స్థాయిలో, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వ హించాలని అధికారులను ఆదేశించా రు. ఓటర్ల నుంచి సేకరించిన ఆధా రాలు, సంబంధిత వివరాలను ఆన్‌లై న్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు, తేడాలు చోటు చేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, అందజేత, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అదే సమయంలో అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యం. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత
# చేరువగా వైద్య సేవలు



- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పల్లె దవాఖానాలు ప్రారంభించిన కలెక్టర్

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 18 :** పల్లె దవాఖానాలతో ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం, కిషన్ దాస్ పేట(కిష్టంపల్లి)లో పల్లె దవాఖానాల ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఆయా పల్లె దవాఖానాలు ప్రారంభించారు. పల్లె దవాఖానాలో నిర్మించిన వివిధ గదులను అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పల్లె దవాఖానాల నిర్మాణంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వైద్యులు, సిబ్బంది ప్రతి రోజూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు వృద్ధులకు వైద్య సేవలు అందిస్తారని వివరించారు. పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు, ఆరోగ్య పరీక్షలు, సలహాలు సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, పీఏసీఎస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, కృష్ణహరి పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు, చిల్డన్స్ పార్క్ ప్రారంభం

- సిపి గౌస్ ఆలం కమ్యూనిటీ పోలీసింగ్ 'మీ కోసం' లో భాగంగా ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ




**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 18 :** వీణవంక పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మండలంలోని కోర్కల్ గ్రామానికి చేరుకున్న సిపి గౌస్ ఆలం కు గ్రామ మహిళలు ఘన స్వాగతం పలికారు.అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో పిల్లలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన 10 సిసి కెమెరాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కమ్యూనిటీ పోలీసింగ్ 'మీ కోసం' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి, పేద గ్రామస్తులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు.అలాగే వీణవంక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్, పోలీస్ సంక్షేమ నిధుల సహకారంతో స్టేషన్ ప్రాంగణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'చిల్డ్రన్స్ పార్క్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ..స్టేషన్‌కు వచ్చే ప్రజల పిల్లలతో పాటు పోలీస్ సిబ్బంది పిల్లల ఆహ్లాదం, వినోదం కోసం ఈ పార్క్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో కేశవపట్నం మండలంలోని మెట్‌పల్లిలో పాఠశాల విద్యార్థులతో సంభాషించి, గోల్ కార్డ్స్, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేయడంతో పాటు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.?వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో మండపాల వద్ద నిర్వాహకులు -మిగతా 2లో

## జాతీయ డిజిటల్ పశు సంపద మిషన్ డేటా
### నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18:** జిల్లాలో జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ కింద పశువుల డేటా క్యాప్చర్, ట్యాగింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, మిగిలిన ప్రక్రియను 10 రోజుల్లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జాతీయ డిజిటల్ పశు సంపద మిషన్ అమలు, పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ- మిగతా 2లో

## ప్రభుత్వ భూమి ప్రభుత్వానికే ఉండాలి

### - అధికారులు సమస్యను పరిష్కరించాలి



**చురకలు విలేకరి, మల్లాపూర్, సెప్టెంబర్ 18:** ప్రభుత్వ భూమి ప్రభుత్వానికె ఉండాలని పునరావాసాల గ్రామస్తులు కోరుతున్నా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే మల్లాపూర్ మండలంలోని నడికుడ, రాఘవపేట గ్రామాల మధ్య ఉన్న సర్వే నెంబర్ 299/2/1లో భూమిని అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని పంటలను పండించుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గతంలో ఎన్నిసార్లు స్థానిక తహసీల్దార్ తో పాటు ఆర్డీవో, జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఇరుగ్రామాల గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అవస్తవాలను నమ్ముతున్నారని గ్రామాభివృద్ధి కోసం సదరు వ్యక్తి కబ్జా చేసుకున్న ఆ ప్రభుత్వ భూమిని కేటాయించాలని, ముఖ్యంగా పశువుల పెంపకానికి ప్రభుత్వ అవసకాలకు వినియోగించాలన్నారు. అవాస్తవాలతో సదరు వ్యక్తి అధికారులకు ఇచ్చి పట్టాలను చేసుకున్నాడంటూ గ్రామస్తులు ఆరోపించారు. నిజనిర్ధారణ చేసి ప్రభుత్వ భూమి ప్రభుత్వ అవసరాలకే వినియోగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటిన ఆటో డ్రైవర్

### ఆటోలో మరిచిన పర్సును పోలీసులకు అప్పగింత



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18:** జగిత్యాల పట్టణంలో ఆటోలో మహిళ మరిచిపోయిన బంగారం, నగదు ఉన్న పర్సును ఆటో డ్రైవర్ నిజాయితీగా పోలీసులకు అప్పగించాడు.పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ ఆటోలో ప్రయాణిస్తూ పర్సును మర్చిపోయింది. అందులో అర తులం బంగారం, రూ.1000 నగదు, ముఖ్యమైన కార్డులు ఉన్నాయి. దాన్ని గుర్తించిన చల్గల్ గ్రామానికి ఆటో డ్రైవర్ పడాల సురేష్ ఎలాంటి స్వార్థం లేకుండా టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఇన్‌స్పెక్టర్ పి.కరుణాకర్‌కు అప్పగించారు. పోలీస్ సిబ్బంది వివరాలు పరిశీలించి టౌన్ హెడ్ కానిస్టేబుల్ డి.మోహన్ చేతుల మీదుగా బాధిత మహిళకు సురక్షితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ఆటో డ్రైవర్ నిజాయితీని అభినందిస్తూ ఇలాంటి విలువలు ప్రజల్లో పెరగాలని ఆకాంక్షించారు.

### వెదురు బొంగు సాగుకు

## హార్టికల్చర్ ద్వారా రాయితీలు కల్పించాలి

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18 :** వెదురు బొంగు సాగుకు హార్టికల్చర్ ద్వారా రాయితీలు కల్పించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ వెదురు బొంగు దినోత్సవాన్ని పురస్కరించుకుని వృత్తిపరంగా వెదురు బొంగుపై ఆధారపడే మేదరి కులస్తులకు మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం మారిన కాలానుగుణంగా కలపకు బదులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా వెదురు బొంగు వినియోగాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. భారతదేశంలో వెదురు సాగును ప్రోత్సహించే విధంగా హార్టికల్చర్ విభాగంలో చేర్చాలని భావించడం, తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెదురు సాగును హార్టికల్చర్‌లో చేర్చి ప్రత్యేకంగా డ్రిప్ సౌకర్యంతో పాటు మానిటరీ బెనిఫిట్స్ రైతులకు అందించేలా నిర్ణయం తీసుకోవడంతో పాటు స్వయంగా వెదురు సాగు చేయుటకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వెదురు బొంగు ఒకసారి నాటితే సంవత్సరాల తరబడి ఎలాంటి చీడపీడలు, కోతుల, అడవి జంతువుల సమస్యలు లేకుండా ప్రతి ఏటా రైతుకు నికర ఆదాయం పొందే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వాలు రాయితీలు కల్పిస్తున్నట్లుగా కల్పించాలని కోరారు.

# జాతీయ డిజిటల్ పశు సంపద మిషన్ డేటా...

**మొదటి పేజీ తరువాయి....** అధికారి డా. ప్రకాశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఎన్డిఎల్ఎం అమలు, పశువుల డేటా క్యాప్చర్, ట్యాగింగ్, నమోదు ప్రక్రియ తదితర అంశాలపై వివరాలను కలెక్టర్‌కు వివరించారు.కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు పశువుల డేటా క్యాప్చర్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని, మిగిలిన 22 శాతం డేటాను క్షేత్రస్థాయిలో వేగవంతంగా నమోదు చేసి 10 రోజుల్లోగా వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని కవర్ చేస్తూ అర్హత కలిగిన ప్రతి పశువుకు డిజిటల్ గుర్తింపు కల్పించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్‌లో భాగంగా ప్రతి పశువుకు 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో కూడిన బార్‌కోడ్ చెవి ట్యాగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక ట్యాగ్ ద్వారా పశువుకు డిజిటల్ గుర్తింపు కల్పించి, దాని పూర్తి సమాచారాన్ని పశుధన్ యాప్, భారత్ పశుధన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ఒకసారి కేటాయించిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా సంబంధిత పశువు యొక్క వివరాలు డిజిటల్‌గా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పశువు యజమాని ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, పేరు, వయస్సు, లింగం, సామాజిక వర్గం, పూర్తి చిరునామా, స్థానం, పాల ఉత్పత్తిదారుల సంఘం లేదా మిల్క్ యూనియన్ సభ్యత్వం, భూమి వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు.

**పశువు పూర్తి వివరాలు డిజిటల్‌గా నమోదు చేయాలి...**

ప్రతి పశువు యొక్క జాతి, వయస్సు, లింగం, పుట్టిన తేదీ, యాజమాన్య వివరాలు, మరణం, పాల ఉత్పత్తి, పాలిచ్చే స్థితి, పొడి దశ తదితర వివరాలను పశుధన్ యాప్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు.పశువుల క్రయవిక్రయాలు జరిగినప్పుడు యాజమాన్య మార్పు, పశువు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలింపు, రవాణా, కదలికల వివరాలను కూడా సంబంధిత 12 అంకెల ట్యాగ్ ఐడీకి అనుసంధానం చేసి నమోదు చేయాలని సూచించారు.

**వ్యాక్సినేషన్, చికిత్స వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి...**

ప్రతి పశువుకు అందించే వ్యాక్సినేషన్, వ్యాధుల నిర్ధారణ, వైద్య చికిత్స, మందుల వినియోగం, ఫాలోఅప్ వివరాలను పశుధన్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ పశువుకు ఏ వ్యాక్సిన్ ఎప్పుడు ఇచ్చారు, ఎలాంటి వైద్య సేవలు అందించారు అనే పూర్తి సమాచారం డిజిటల్ రికార్డులో అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పశువులకు వచ్చే వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, వ్యాధుల పర్యవేక్షణ, వ్యాధి నియంత్రణ చర్యలను సమర్థవంతంగా చేపట్టేందుకు డిజిటల్ డేటా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**సంతానోత్పత్తి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి..**

పశువుల సంతానోత్పత్తికి సంబంధించిన కృత్రిమ గర్భధారణ , గర్భ నిర్ధారణ , గర్భధారణ, దూడ పుట్టిన వివరాలు తదితర సమాచారాన్ని సంబంధిత పశువు ట్యాగ్ ఐడీకి అనుసంధానం చేసి నమోదు చేయాలని సూచించారు. పాలిచ్చే పశువులు, పొడి దశలో ఉన్న పశువుల వివరాలను కూడా సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. పశువుల ఉత్పాదకత, సంతానోత్పత్తి సామర్థ్యం తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

**గొర్రెలు, మేకల మంద వివరాలు కూడా నమోదు చేయాలి..**

గొర్రెలు, మేకలకు సంబంధించిన మంద నిర్వహణ, పశువుల సంఖ్య, ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్, చికిత్స, వ్యాధుల పర్యవేక్షణ, ఫాలోఅప్ తదితర వివరాలను కూడా డిజిటల్ ప్లాట్‌ఫాంలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కుక్కల నియంత్రణకు సంబంధించిన యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం, వ్యాధుల పర్యవేక్షణ, వ్యాధి నియంత్రణ చర్యలు, పశుసంవర్ధక శాఖకు సంబంధించిన మౌలిక వసతుల మ్యాపింగ్ వివరాలను కూడా డిజిటల్ ప్లాట్‌ఫాంలో నమోదు చేయాలని సూచించారు.

**మండల, గ్రామ స్థాయి కమిటీలు సమన్వయంతో పనిచేయాలి...**

ఎన్డిఎల్ఎం కార్యక్రమం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, మండల స్థాయిలో సంబంధిత అధికారులతో, గ్రామ స్థాయిలో సంబంధిత సిబ్బంది, ప్రతినిధులతో కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయి కమిటీలు తమ పరిధిలోని అన్ని గ్రామాల్లో డేటా క్యాప్చర్, పశువుల ట్యాగింగ్, పశు ఆధార్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు.

గ్రామ స్థాయి కమిటీలు ప్రతి ఇంటిని, ప్రతి పశువును క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఏ ఒక్క పశువు కూడా డిజిటల్ నమోదు నుంచి మిగిలిపోకుండా చూడాలని ఆదేశించారు. ప్రతిరోజూ గ్రామాల వారీగా ట్యాగింగ్, డేటా క్యాప్చర్ పురోగతిని సమీక్షించాలని, పెండింగ్‌లో ఉన్న వివరాలను గుర్తించి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన 22 శాతం డేటా క్యాప్చర్, ట్యాగింగ్ ప్రక్రియను 10 రోజుల్లోగా పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పశువులకు డిజిటల్ గుర్తింపు కల్పించడం ద్వారా ప్రతి పశువు యొక్క ఆరోగ్యం, వ్యాక్సినేషన్, చికిత్స, సంతానోత్పత్తి, పాల ఉత్పత్తి, యాజమాన్యం, క్రయవిక్రయాలు, రవాణా, వ్యాధుల పర్యవేక్షణ తదితర వివరాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ డేటా ఆధారంగా పశుసంవర్ధక శాఖ అందించే సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించడంతో పాటు, పశువుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నియంత్రణ, సంతానోత్పత్తి మరియు పశు సంపద అభివృద్ధికి మెరుగైన ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

డేటా నమోదు, ట్యాగింగ్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఖచ్చితత్వంతో పనిచేయాలని, నిర్దేశించిన గడువులోగా ప్రతి పశువుకు 12 అంకెల డిజిటల్ గుర్తింపు కల్పించి, పూర్తి సమాచారాన్ని పశుధన్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. ప్రకాశ్, జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డి.పి.ఓ, మదన్మోహన్, డి ఏ ఓ భాస్కర్, మున్సిపల్ కమిషనర్లు, మండల పశు వైద్య అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు, చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం..

**మొదటి పేజీ తరువాయిగా....** తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించాలని సీపీ సూచించారు. ఉత్సవాలు, నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా స్థానిక చెరువులు, నిమజ్జన ప్రాంతాలను పోలీసు అధికారులు స్వయంగా పరిశీలిస్తున్నారని వెల్లడించారు.విద్యార్థులకు పెన్సిల్లు పంపించేశారు.ఈ కార్యక్రమంలో వీణవంక సర్పంచ్ దాసారపు సరోజన, కోర్కల్ సర్పంచ్ పూదరి రమ్యక్రిష్ణ, ఏసిపి మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్,ఎస్ ఐ ఆవుల తిరుపతి,ఏఎస్ఐ వెంకట్ రెడ్డి,పోలీస్ సిబ్బంది,గ్రామ ప్రజాప్రతి నిధులు,స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన కానిస్టేబుల్ నియామకాల్లో ప్రత్యేక నిబంధనలు అమలు చేయాలి

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 18 :** గిరిజన ప్రాంతాల యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక నిబంధనలు అమలు చేసి సామాజిక,ఆర్థిక అభివృద్ధికి దోహదపడే విదంగా 2026 సివిల్ పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం



అందజేశారు. గిరిజన ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, రామదాసు నాయక్ , ఆది నారాయణ, పాయం వెంకటేశ్వర్లుతో కలిసి ముఖ్యమంత్రికి మంత్రి అడ్లూరి సంబంధిత అంశాలపై సమగ్రంగా వివరించారు.2026లో విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఎస్సిటి సివిల్ నియామక నోటిఫికేషన్‌లో గిరిజన ప్రాంతాల పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో ఆయా ప్రాంతాలకు చెందిన గిరిజన నిరుద్యోగ యువత లో ఆందోళన నెలకొందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.గతంలో అమల్లో ఉన్న ప్రత్యేక నిబంధనల ప్రకారం గిరిజన ప్రాంతాల యువతకు లభిస్తున్న ఉద్యోగ అవకాశాలను కొనసాగించాలన్నారు.

## విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ (18):** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్ కొండాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం యూనిఫామ్‌లను గ్రామ సర్పంచ్ తోట రమేష్ పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రేణుక, ఉపాధ్యాయులు రశ్మిత, ప్రసాద్, నవీన్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ సింగని మారుతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పోషణ మాసం



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 18 :** మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం మోతె అంగన్‌వాడీ 1వ సెంటర్‌లో గ్రామ సర్పంచ్ సంగెపు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ రాజశ్రీ మాట్లాడుతూ పోషణ ప్రతి ఒక్కరి బాధ్యతని, మన అంగన్‌వాడీ మన బాధ్యతగా భావించాలన్నారు. గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీలో వేడి భోజనం, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం, హెచ్‌సీఎం గురించి వివరించారు. పిల్లలు లోప పోషణకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామంలో దొరికే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని, పెరటి తోటలు పెంచుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్త రాజేశ్వరి ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీ కావాలని, ఐరన్ మాత్రలు తప్పక వాడాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ ఆరోగ్య లక్ష్మి ప్రతి నెలా కమిటీ మీటింగ్ ఉంటుందని, సర్పంచ్ మహేష్ అంగన్‌వాడీ కేంద్రాలు బాగా పనిచేస్తున్నాయని, సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్ శారద, తల్లులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో 108 నైవేద్యాలతో గణనాథుడికి పూజలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18:** జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్, శివవీధి ఆల్ఫోర్స్ పాఠశాలల్లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి 108 రకాల నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన పెంచడమే ఇలాంటి కార్యక్రమాల ఉద్దేశమని, గణనాథుడి ఆశీస్సులతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రాంగణాలు భక్తి వాతావరణంతో కళకళలాడగా విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు అడ్డుపడవద్దు

**-నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పనులు పూర్తి చేయాలి**

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18:** అభివృద్ధి పనులకు అడ్డుపడవద్దని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధరూర్ క్యాంప్ రామాలయం నుంచి మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల వరకు నిర్మిస్తున్న నూతన రహదారి పనులను, కొత్త బస్టాండ్‌లో చేపడుతున్న వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు నిరంతరం అందేలా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే డా. సంజయ్ మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని, ప్రజలు వరుసగా మూడుసార్లు తిరస్కరించినా అదే పనిగా అధికారులకు, అభివృద్ధి పనులకు అడ్డు రావడం బాధాకరమన్నారు. పట్టణంలో నాణ్యతతో పనులు జరుగుతున్నాయి. వర్షం వల్ల బీటీ రోడ్డు దెబ్బతిందని, నాణ్యతతో పూర్తి చేస్తామని, ప్రజల సహకారంతో జగిత్యాలను అభివృద్ధి చేస్తామన్నారు. దుకాణ సముదాయాల అద్దెలపై నేటి మార్కెట్ విలువ ఆధారంగా సమీక్ష చేయాలని కమిషనర్‌కు సూచించామని, అద్దె చెల్లించని వారికి నోటీసులిచ్చి సీజ్ చేస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా జగిత్యాల పట్టణ అభివృద్ధే అంతిమ లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, ఆర్అండ్‌బీ డీఈ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కోఆప్షన్ సభ్యుడు గట్టు సతీష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుమల రాజ్ కుమార్, కౌన్సిలర్లు ప్రశాంత్ రావు, జుంబర్తి రాజ్ కుమార్, కోరుకంటి రాము, తిరుమలయ్య, చీటి లక్ష్మీనారాయణ, నాయకులు సుధాకర్ రావు, ప్రభాకర్, చందా పృథ్వీ, అరుముల్ల పవన్, కప్పల శ్రీకాంత్, రమేష్, స్వామి, ఈశ్వర్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ (18):** పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్వైజర్ శంకరమ్మ సూచించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పోషణ పక్షం మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ శంకరమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతిరోజూ సమతుల ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారులకు ప్రతిరోజూ బాలామృతం, గుడ్లు వంటి పోషకాహారాన్ని అందించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, గర్భిణీలు ప్రతిరోజూ పాలు, గుడ్లు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే పుట్టబోయే శిశువు ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని తెలిపారు. బాలింతలు కూడా పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బస శ్రావణ్, ఉపసర్పంచ్ ముక్కెర సతీష్, పంచాయతీ కార్యదర్శి సుమలత, అంగన్వాడీ టిచర్ లు రాజేశుని గిరిజ, మర్రిగడ్డ రత్నమాల, లోక సరిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లి, సిరికొండ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇప్పపెల్లిలో నిర్మాణంలో ఉన్న వీవో భవనం, కిచెన్ షెడ్, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అంగన్‌వాడీ పిల్లలతో ఏబీసీడీలు, 1,2,3లు చదివించి చురుకుగా సమాధానం చెప్పిన పిల్లలను, టీచర్‌ను అభినందించారు. నిర్మాణ పనులు నెల రోజుల్లో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిరికొండలో వీవో భవనం, అంగన్‌వాడీ భవనం పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి క్లాస్ రూమ్‌ల విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పారిశుధ్యం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పెంచుతున్న కూరగాయల మొక్కలను చూసి ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి బోధన, వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మెనూ ప్రకారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై అసహనం వ్యక్తం చేస్తూ రుచికరంగా వండేలా చర్యలు తీసుకోవాలని డీఈవో కె.రామును హెచ్చరించారు. పాఠశాలల్లో పిచ్చి మొక్కలు తొలగించి శానిటేషన్ చేయాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డీఈవో కె.రాము, తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఈ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**చురకలు విలేకరి, సారంగాపూర్, సెప్టెంబర్ 18:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో సలీమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**చురకలు విలేకరి, గొల్లపెల్లి, సెప్టెంబర్ 18:** గొల్లపెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్. లత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచితో పాటు విద్యార్థినులకు అందుతున్న ఆహారంపై వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం చేశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని తన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, పరీక్షల కోసం అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్, ఉన్నారు.

## స్వచ్ఛత హీ సేవా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరణ

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18:** స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆవిష్కరించారు. స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు, స్థానిక సంస్థలు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి, పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు.

# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం : సెప్టెంబర్ (18):** మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని వెల్మ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జువ్వాడి నరసింగరావు సూచించారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇబ్రహీంపట్నం మండల స్థాయి సమీక్ష సమావేశం శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, సాధించిన పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సమావేశంలో వెల్లడించారు.

**అధికారుల పనితీరుపై ఆగ్రహం...**

అటవీశాఖ, హార్టికల్చర్ శాఖ అధికారుల పనితీరుపై జువ్వాడి నరసింగరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు వాటి ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు, రైతులకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గ్రామాల్లో పర్యటించాలని అన్నారు. హార్టికల్చర్ శాఖ ద్వారా రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, ఉద్యాన పంటల సాగు, మొక్కల పెంపకం, పంటల సంరక్షణ, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర అంశాలపై సమీక్షించారు. రైతులకు అవసరమైన సమాచారం సకాలంలో అందించడంతో పాటు పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అటవీశాఖ పరిధిలో చేపడుతున్న మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను కూడా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గ్రామాల అభివృద్ధిపై సమీక్ష**

ఇబ్రహీంపట్నం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపైనా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులు వివరాలను అందించారు. ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నరసింహారావు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

**సమన్వయంతో అభివృద్ధికి బాట..**

వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అన్నారు. ఒక శాఖకు సంబంధించిన పనులతో మరో శాఖకు సంబంధం ఉన్న సందర్భాల్లో పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత మెరుగ్గా అందించడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి జయరాజ్, ఎంపీడీవో గణేష్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీవో రామకృష్ణరాజు, ఎంఈఓ మధు, వ్యవసాయశాఖ అధికారి రాజ్‌కుమార్, మండల అధికారులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పిల్లలతో సరదాగా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 18 :** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలోని అంగన్వాడీ చిన్నారులతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సరదాగా ముచ్చటిస్తూ సందడి చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి పేర్లు, చదువు, ఇష్టమైన ఆటలు, పాటల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు చిన్నారులు తమదైన శైలిలో బుజ్జి బుజ్జి సమాధానాలు ఇచ్చారు. చిన్నారుల సమాధానాలు విన్న కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. కొంతమంది చిన్నారులు ధైర్యంగా ఎబిసిడి లు, 1,2,3 లు చెప్పి తమ ప్రతిభను ప్రదర్శించారు. పిల్లల చురుకుదనం, సమయస్ఫూర్తిని చూసి కలెక్టర్ మురిసిపోయారు. చిన్నారులతో కాసేపు సరదాగా గడుపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. కలెక్టర్ తమతో ఆప్యాయంగా మాట్లాడటంతో చిన్నారులు మరింత ఉత్సాహంగా స్పందించారు. వారి కేరింతలు, నవ్వులతో అంగన్వాడీ కేంద్రం సందడిగా మారింది. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, మెనూ అమలు, పరిశుభ్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ఆటపాటల ద్వారా చిన్నారుల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్నారులకు విద్యతో పాటు మంచి అలవాట్లను అలవర్చాలని ఉపాధ్యాయులకు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై పిల్లలకు ఇప్పటినుండే అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల ప్రతిభను చిన్న వయస్సు నుంచే గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి చిన్నారికి ప్రేమ, ఆప్యాయతతో సేవలు అందించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. చిన్నారులతో మమేకమై వారి మాటలు వింటూ కలెక్టర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కథలు, పాటలు, ఆటలు, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక అభ్యసనంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ తమతో సరదాగా ముచ్చటించడంతో చిన్నారుల్లో ఆనందం వెల్లివిరిసింది. బుజ్జి మాటలతో సమాధానాలు చెబుతున్న చిన్నారులను చూసి కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. వారి ప్రతిభను మరింతగా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. చిన్నారులతో కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటించిన దృశ్యం అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధికారి హోదాను పక్కనపెట్టి పిల్లలతో కలిసిమెలిసి మాట్లాడిన తీరు స్థానిక ప్రజా ప్రతినిధులను, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. చిన్నారుల కేరింతలు, నవ్వులతో అంగన్వాడీ కేంద్రం ఆహ్లాదకరంగా మారింది. పిల్లల బుజ్జి సమాధానాలు కలెక్టర్‌ను సంతోషపరిచాయి. చిన్నారుల చురుకుదనాన్ని అభినందిస్తూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పిల్లల ఆరోగ్యం, విద్య, పోషణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. అంగన్వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి చిన్నారికి మెరుగైన బాల్యాన్ని అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించేలా అంగన్వాడీ కేంద్రాల్లో సానుకూల వాతావరణం ఉండాలని చెప్పారు. అదేవిధంగా గ్రామంలో నిర్మిస్తున్న వివో భవనాన్ని పరిశీలించి పూర్తి స్థాయిలో పనులు చేసి భవనం ప్రారంభత్సవం చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**-మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో సిరిసిల్ల పోక్సో కోర్టు తీర్పు**
**-మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలి**
**-జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 18 :** మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి సిరిసిల్ల పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికపై మధ్యప్రదేశ్‌కు చెందిన చతుర్ సింగ్ మున్నా లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎల్లారెడ్డిపేట సీఐ బన్సీలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ దర్యాప్తు చేపట్టి ఆధారాలను సేకరించిన అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల తదితరులు కేసు విచారణకు సహకరించారు. మొత్తం 19 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ వాదనలు వినిపించారు.శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువైనట్లు నిర్ధారించిన న్యాయస్థానం నిందితుడు చతుర్ సింగ్ మున్నాకు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

**మహిళల భద్రతకు ప్రాధాన్యం**

మహిళలు,యువతులు, విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అన్యాయం జరిగినా బాధితులు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.నేరానికి పాల్పడిన వారు ఎవరైనా చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు.సమర్థవంతమైన దర్యాప్తుతో పాటు ప్రాసిక్యూషన్‌తో సమన్వయం చేసుకుంటూ నిందితులకుచట్ట ప్రకారం శిక్షలు పడేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని ఎస్పీ తెలిపారు.

**అధికారులకు ఎస్పీ అభినందనలు**

ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి, ప్రస్తుత సిరిసిల్ల డీఎస్పీలు చంద్రశేఖర్, నాగేంద్రచారి, అప్పటి, ప్రస్తుత ఎల్లారెడ్డిపేట సీఐలు బన్సీలాల్, వెంకటేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రవణ్ యాదవ్, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమేష్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ లీగల్ సపోర్ట్ పర్సన్ లహరికలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు.

# మండల వైద్యాధికారిపై డీఎంహెచ్‌వోకు జర్నలిస్టుల ఫిర్యాదు

**-ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణ**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 18 :** ఎల్లారెడ్డిపేట మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని జర్నలిస్టులకు ముందుగా అందించడం లేదని ఆరోపిస్తూ మండలానికి చెందిన జర్నలిస్టులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి (డీఎంహెచ్‌వో) ఫిర్యాదు చేశారు.మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు వైద్య ఆరోగ్య కార్యక్రమాలు,అవగాహన కార్యక్రమాలు,ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం స్థానిక మీడియాకు అందడం లేదని జర్నలిస్టులు డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఉపయోగపడే వైద్య ఆరోగ్య కార్యక్రమాల వివరాలు ప్రజలకు చేరేందుకు మీడియాకు సమయాను కూలంగా సమాచారం అందించడం అవసరమని వారు పేర్కొన్నారు.ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడం లో స్థానిక మీడియా కీలక పాత్ర పోషిస్తుందని,అందువల్ల మండల స్థాయిలో జరిగే కార్యక్రమాల సమాచారాన్ని జర్నలిస్టులకు అందించాలని డీఎంహెచ్‌వోను



కోరారు.జర్నలిస్టుల ఫిర్యాదుపై స్పందించిన మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఇకపై మండలంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని జర్నలిస్టులకు అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.మండలంలో వైద్య ఆరోగ్య శాఖ చేపట్టే కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందిస్తే ప్రజలకు మరింత సమాచారం చేరే అవకాశం ఉంటుందని జర్నలిస్టులు పేర్కొన్నారు.

# చిన్నారులు, నవజాత శిశువులకు ప్రత్యేక వైద్య శిబిరం

**చురకలు ప్రతినిధి,హనుమకొండ, సెప్టెంబర్ 18 :** ఉమ్మడి వరంగల్ జిల్లా సహా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా చిన్న పిల్లల తల్లిదండ్రులకు ఒక అద్భుతమైన అవకాశం అందుబాటులోకి వచ్చిందని హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ ప్రముఖ వైద్యులు తెలిపారు. నవజాత శిశువులు, చిన్నారులలో తలెత్తే ఆరోగ్య సమస్యల నివారణార్థం ప్రతి నెలా ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను అందించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం రోజున హనుమకొండలోని యశోద క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

**ప్రతి నెల మూడవ గురువారం ప్రత్యేక సేవలు**




హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌కు చెందిన కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ జి. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శతాబ్ది గిరి ప్రతి నెల మూడవ గురువారం రోజున హనుమకొండలో అందుబాటులో ఉండి వైద్య సేవలు, సలహాలు, సంప్రదింపులు అందిస్తారు.

**లభించే వైద్య సేవలు:**

నవజాత శిశు సంరక్షణ, నెలలు నిండకుండా జన్మించడం (ప్రీమెచ్యూరిటీ), పుట్టుకతో వచ్చే శ్వాసకోశ సమస్యలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువుల సంరక్షణపై ప్రత్యేక వైద్య సలహాలు.పిల్లల గుండె వైద్యం, చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, ఇతర కార్డియాక్ సమస్యల నిర్ధారణ, నిపుణులైన కార్డియాలజిస్ట్ ద్వారా చికిత్స సలహాలు.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ పిల్లల ఆరోగ్య భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కోరారు. అపాయింట్‌మెంట్లు, ఇతర వివరాల కోసం 9618328673, 9247565105 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.ఈ విలేకరుల సమావేశంలో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సిబ్బంది వి.కె. రెడ్డి, చంద్రకాంత్, మహేష్, విజయ్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మంథని గౌతమేశ్వర స్వామి దేవాలయ చైర్మన్‌గా గుండా రాజు





**చురకలు ప్రతినిధి మంథని,సెప్టెంబర్ 18 :** మంథని పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గౌతమేశ్వర స్వామి దేవాలయం చైర్మన్‌గా గుండా రాజు ను నియమిస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం అందజేశారు.శ్రీ గౌతమేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా తనను నియమించడం పట్ల గుండారాజు హర్షం వ్యక్తం చేశారు.తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీనుబాబు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా తన ఎన్నికకు సహకరించిన మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు, బోయినిపేట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం తన వంతు కృషి చేస్తానని,ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఈ సందర్భంగా గుండా రాజు పేర్కొన్నారు. గుండా రాజుకు శ్రీ గౌతమేశ్వర దేవాలయ చైర్మన్ పదవి రావడం పట్ల మంథని పట్టణంలోని ముదిరాజులు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణమూర్తి శర్మకు ఆత్మీయ సత్కారం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 18 :** ఎల్లారెడ్డిపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బుగ్గ కృష్ణమూర్తి శర్మను తిమ్మాపూర్ సింగిల్ విండో డైరెక్టర్లు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆత్మీయంగా సత్కరించారు.ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి,శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కృష్ణమూర్తి శర్మ మాట్లాడుతూ,తనపై నమ్మకంతో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ, డైరెక్టర్లు పెంజర్ల నారాయణ,రాయవేణి లక్ష్మణ్, శ్రీరామ్ నాయక్,నరహరి నాయక్, గుర్రాల సత్తిరెడ్డి,అందే బాలయ్య, సీఈఓ శశివర్ధన్ గౌడ్, సిబ్బంది రాగం శ్రీకాంత్,అందే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎంపీటీసీ వినతి



**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 18 :** ఎల్లారెడ్డిపేట మండలం కిష్టం పల్లిలో నిర్మించిన పల్లె దావఖానాకు గర్భవతులు బాలింతలు సుమారు కిలోమీటర్ నర దూరం నుండి రావాల్సి వస్తుందని పేషెంట్ల సౌకర్యార్థం ఎలక్ట్రికల్ ఆటో ఇప్పించాలని ఎల్లారెడ్డి పేట మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్ జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ దృష్టికి తీసుకెళ్లగా గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ఎలక్ట్రికల్ ఆటో కొనుగోలు చేసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పేషెంట్లు రావడానికి వినియోగించుకోవచ్చని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సర్పంచ్ ఎలగందుల నరసింహులుకు సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 18 :** వీణవంక మండల పరిధిలోని హిమ్మత్ నగర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన లకోట రాధమ్మ కుటుంబానికి ఆరే కుల సంక్షేమ సంఘ సభ్యుల సహకారంతో శుక్రవారం నాలుగు వేల ఆర్థిక సహాయాన్ని అధ్యక్షులు మోర్తాల రఘువరన్,ఉపాధ్యక్షులు రవుసాల రాము,లడేలింగారావు,రవుసాల రాజులు అందజేశారు.

## మంత్రి చొరవతో ముళ్ళపదలు తొలగింపు




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 18 :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరవతో ముల్కలపల్లి నుండి సెంటినరీ కాలనీకి వెళ్లే రోడ్డు ప్రక్కన ఉన్న ముళ్ళ పొదలను శుక్రవారం తొలగించారు. ఈ విషయమై ముళ్ళ పొదలు తొలగించాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, రామగిరి మండల నాయకులు రొడ్డ బాపన్న దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు తెలుపగా ఆర్.జి.3 జిఎం మధుసూదన్ను వెంటనే రోడ్డు ప్రక్కనగల ముళ్ళపదలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. దీంతో ముళ్ళ పొదలను తొలగించి ప్రమాదాలు జరగకుండా నివారించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు తొట్ల తిరుపతి యాదవ్‌కు ఆర్.జి.ఎం మధుసూదన్‌కు ములకలపల్లి నాయకులు తీగల రాజయ్య గౌడ్ బొల్లెపల్లి దశరథంగౌడ్,గాజుల సతీష్‌లో ధన్యవాదాలు తెలిపారు.

## మాట నిలబెట్టుకున్న సర్పంచ్

**-లస్మక్కపల్లిలో రూ.2 లక్షలతో వీధి లైట్లను ఏర్పాటు**



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 18 :** స్థానిక ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వీణవంక మండల పరిధిలోని లస్మక్క పల్లిలో శుక్రవారం సుమారు రూ.2 లక్షల విలువైన వీధి లైట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ సహకారంతో ఈ లైట్లను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గ్రామం నుంచి ఎస్సీ కాలనీ వరకు ప్రధాన రహదారిపై లైట్లను ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండటంతో పాటు, రాత్రి సమయాల్లో ప్రజలకు భద్రతా పరంగా కూడా ప్రయోజనం ఉంటుందని అన్నారు. వీరితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 18 :** ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్‌లో ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలనుశుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ ఏఎంసీ చైర్మన్ షేక్ సభేరా బేగంగౌస్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మటి నరసయ్యలు కేక్ కట్‌చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్వీట్లను పంచుకొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నిండు నూరేళ్లు మరెన్నో జన్మ దినోత్సవాలు జరుపుకోవాలని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని మంత్రి పదవి పొందాలని వారు ఆకాంక్షించారు . జన్మదిన వేడుకలలో ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామిరెడ్డి మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి వంగ గిరిధర్ రెడ్డి సాహెబ్ , సర్పంచులు బాపురెడ్డి నెత్తట్ల లక్ష్మయ్య మామిండ్ల కిషన్, వెంకట్ రెడ్డి , మాదాసు స్రవంతి బాబు ,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సురేందర్ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు, ఎస్సీ ఎస్టీ జిల్లా స్థాయి మార్టరింగ్ కమిటీ మెంబర్ బిపేట రాజకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్రెడ్డి, మేడిపల్లి దేవానందం ఎడ్ల రాజ్ కుమార్, రాములు, వంగ శ్రీకాంత్ రెడ్డి, కంచర్ల రాజు, రవి, రఫిక్, మేడిపల్లి రవీందర్ రాజేందర్ రెడ్డి ఎల్లా గౌడు బాలచందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు మండలాల నుండి టిఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు

**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 18 :** సిరిసిల్ల నియోజకవర్గం లోని ఎల్లారెడ్డిపేట మండలంలో మహిళా సీనియర్ నాయకురాలు, బొమ్మన వేణి పరుశరాములు,కదిరే రేణుక,కదిరే భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో, వీర్నపల్లి మండలం నుండి సీనియర్ నాయకులు బండి శ్రీహరి,మండేపల్లి రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలం నుండి బందెల రాజు ఆధ్వర్యంలో,పలు గ్రామాల నుండి యువ నాయకుడు సయ్యద్ జావిద్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం దాదాపు 200 మంది స్వచ్ఛందంగా తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరడం జరిగింది. టిఆర్ఎస్‌లో చేరడానికి వచ్చిన కార్యకర్తలను సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈనెల 20న కొడంగల్‌లో కవితక్క పాంచ జన్య సంకల్ప సభ నిర్వహించడం జరుగుతుందని,ఈ సభలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని,రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కవితక్క అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు,యువకులు కవితక్కకు బ్రహ్మరథం పట్టడం జరుగుతుందన్నారు . ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితక్క ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించడం జరుగుతుందని, ఉద్యమకారుల,సింగరేణి కార్మికుల, ఆటో కార్మికుల,నిరుద్యోగుల పక్షాన, నేరెళ్ల బాధితులకు న్యాయం,పోలీసు ఉద్యోగాల పెంపు ఇంకా ప్రజా సమస్యల పరిష్కారం చేయాలంటూ ఉద్యమాలు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. కవితక్క ప్రతిపాదిస్తున్న పాంచజన్య పథకాలు, ఉచిత విద్య,ఉచిత వైద్యం,రైతు సంక్షేమం,ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై



స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావడం జరుగుతుందన్నారు. మహిళలు,యువకులు, ప్రజలు పార్టీలో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2029లో తెలంగాణకు కల్వకుంట్ల కవితక్కను ముఖ్యమంత్రి చేయడమే మన అందరి లక్ష్యం అన్నారు. కవితక్క ఆశయాలు, పాంచజన్య సూత్రాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్ళి, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలన్నారు. సామాజిక న్యాయం,సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయాలని మజీద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బైరి రాజేష్,మల్లవ్వ,లాస్య,లచ్చువ్వ,బొమ్మన వేణి పద్మ,పుష్పలత,ఎల్లవ్వ,మంజుల, పూజిత,అల్లే సత్తవ్వ, నర్సయ్య, అనసూయ, గంగారాణి, బుధవ్వ, నిమ్మల లావణ్య, మాధవి, అఖిల, తమ్మినవేని మల్లయ్య, ఈశ్వరవ్వ, శిరీష, దుర్గమ్మ, జ్యోతి, ముస్తాబాద్ మండల నాయకులు మార్వాడి దేవరాజు పాల్గొన్నారు.

# నాగేందర్ పై హైకోర్టు వేటు.. ప్రజాస్వామ్య విజయం

**-ఈ విజయం కేసీఆర్‌కు అంకితం**

**-ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 18 : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యం సాధించిన విజయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుండి విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ.. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ తరఫున హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. “ఇది బీఆర్ఎస్ పార్టీ విజయం.. కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ పోరాటానికి దక్కిన విజయం” అని పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.



దానం నాగేందర్ అనర్హత కోసం గత రెండున్నరేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ఈ తీర్పుతో ఫలితం దక్కిందన్నారు. ప్రజలను ఎల్లకాలం మోసం చేయవచ్చని సీఎం రేవంత్ రెడ్డి భావించారని, కానీ హైకోర్టు తీర్పుతో ఆ వ్యవహారానికి బ్రేక్ పడిందని అన్నారు. “ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిది” అని పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. దానం నాగేందర్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల అంశంలోనూ న్యాయపరమైన పరిణామాలు ఉంటాయని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మిగతా ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, “ఏ పార్టీకి చెందినవారమో చెప్పుకోలేని పరిస్థితి ఫిరాయింపు ఎమ్మెల్యేలది” అని అన్నారు. “అమ్మా, నాన్న ఎవరో చెప్పుకోలేని పరిస్థితి పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలది” అంటూ పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని, ఖైరతాబాద్ ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మోసాలకు తగిన తీర్పు ఇస్తారని అన్నారు. కడియం శ్రీహరి వ్యవహారంపైనా పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. “పార్టీ మారింది కడియం శ్రీహరి. అనైతికం ఎవరిది అనేది ఎథిక్స్ కమిటీ తేల్చాలి” అని అన్నారు. దానం నాగేందర్‌పై తీవ్ర విమర్శలు చేసిన పాడి కౌశిక్ రెడ్డి, “దానం నాగేందర్ ఫైటర్ కాదు.. చీటర్” అని వ్యాఖ్యానించారు. “దానం నాగేందర్‌కు పట్టిన గతే పార్టీ మారిన మిగతా ఎనిమిది మందికి కూడా పడుతుంది” అని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హైకోర్టు తీర్పు పార్టీ ఫిరాయింపులపై జరుగుతున్న రాజకీయ, న్యాయ పోరాటంలో కీలక పరిణామమని ఆయన పేర్కొన్నారు.

# విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలి

### -సీపీ గౌష్ ఆలం



**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 18 :** విద్యార్థులు చిన్ననాటి నుంచే తమ భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని,దానిని సాధించేందుకు క్రమశిక్షణ,పట్టుదలతో కష్టపడాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం,ఐపీఎస్ సూచించారు. కేశవపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన "పోలీసులు మీకోసం" కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు,తల్లిదండ్రులకు భవిష్యత్ ప్రణాళిక,లక్ష్య సాధనపై అవగాహన కల్పించారు.విద్యార్థులను వారి భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని, ప్రతి విద్యార్థికి గోల్ కార్డు రూపొందించి, ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,తన తండ్రి ఆర్మీలో పనిచేయడం వల్ల చిన్ననాటి నుంచే యూనిఫాం సర్వీస్‌పై ఆసక్తి ఏర్పడిందని,అదే లక్ష్యంగా పెట్టుకుని కష్టపడి 25ఏళ్ల వయసులో ఐపీఎస్ సాధించానని తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కేవలం లక్ష్యాన్ని చేరుకోవడం మాత్రమే కాకుండా,ఆ లక్ష్యం వెనుక ఉన్న 'పర్పస్'ను నెరవేర్చడం అత్యంత ముఖ్యమని అన్నారు.విద్యార్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని, అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

**డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి**

మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని సీపీ హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ,చదువుతో పాటు క్రీడలు,సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్‌వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన డ్రగ్స్ వ్యతిరేక స్కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**సీసీ కెమెరాల ప్రారంభం.. క్రీడా సామగ్రి పంపిణీ**

మెట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను సీపీ ప్రారంభించారు.గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు.గ్రామ పంచాయతీ కార్మికులకు హెల్మెట్లు, విద్యార్థులకు వాలీబాల్,క్యారమ్ బోర్డులు ,ఇతర క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు.

**గణేష్ మండపాల పరిశీలన**

కేశవపట్నం పరిధిలోని పలు గణేష్ మండపాలను సీపీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల వద్ద ఎలక్ట్రికల్ సేఫ్టీ,ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ తీగలు, నీటి వనరులు, ట్రాఫిక్ తదితర అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని, భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.మండపాల వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను సీపీ తనిఖీ చేసి, సిబ్బంది విధులు, భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఏసీపీ మాధవి,ఎస్సై శేఖర్,పోలీసు అధికారులు ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు,గ్రామప్రజలు పాల్గొన్నారు.

# గునుకులపల్లి - చిగురుమామిడి రోడ్డు మార్గం పరిశీలించిన కలెక్టర్

### -ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం



**చురకలు విలేఖరి చిగురుమామిడి సెప్టెంబర్ 18 :** చిగురుమామిడి మండల కేంద్రం నుంచి గునుకులపల్లి వరకు లంబాడి పల్లి మీదుగా నిర్మించే ఇంటర్మీడియట్ రోడ్డు(5.5 మీటర్లు) మార్గాన్ని శుక్రవారం కలెక్టర్ చిత్రా మిశ్రా, కరీంనగర్ ఆర్డిఓ షర్మిలతో కలిసి పరిశీలించారు. ఏడున్నర(7.5) కిలోమీటర్ల మీర ఈ రోడ్డు నిర్మించనున్నారు.ఇందులో ఆరున్నర (6.5)కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి హ్యామ్ పథకం కింద నిధులు మంజూరవగా ఈ ప్రక్రియ టెండర్ దశలో ఉంది.మిగతా ఒక కిలోమీటర్ మేర రోడ్డు నిర్మించేందుకు ఈ రూట్ ను గ్రామాల వారీగా కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ కనకయ్య, ఇంజనీరింగ్ అధికారులు జనార్దన్ ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

**తగ్గనున్న దూర భారం**

గునుకులపల్లి – చిగురుమామిడి వరకు లంబాడి పల్లె మీదుగా నిర్మించే ఈ రోడ్డు ఇందుర్తి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి గ్రామాలను కలుపుతుంది. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గనుంది.వారి వెంట డీపీఆర్ఈ జనార్ధన్, పీఆర్ ఏఈ నిరంజన్ తదితరులున్నారు.

# గణేష్ మండపాలను సందర్శించిన గోదావరిఖని ఏసీపీ

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 18 :**శుక్రవారం సాయంత్రం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాలను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,రామగుండం సీఐ కృష్ణకుమార్‌తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఏసీపీ ఎం.రమేష్ మాట్లాడుతూ, 23-09-2026 బుధవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రలో నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**నిర్వాహకులకు ముఖ్య సూచనలు**


1. నిమజ్జన శోభాయాత్రలో పోలీసులు సూచించిన మార్గం, సమయాలను తప్పనిసరిగా పాటించాలి. 2. శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. 3. డీజేలకు అనుమతి లేదు. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించాలి. 4. సౌండ్ సిస్టమ్ వినియోగంలో నిర్దేశిత సమయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలి. 5. శోభాయాత్రలో అశ్లీల, రెచ్చగొట్టే పాటలు లేదా నినాదాలు చేయరాదు. 6. గణేష్ మండపాలు, శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో విద్యుత్ భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలి. 7. శోభాయాత్రలో పాల్గొనే యువత మద్యం సేవించి



పాల్గొనరాదు. 8. గణేష్ విగ్రహాలను తరలించే వాహనాలపై అధిక సంఖ్యలో వ్యక్తులు,చిన్న పిల్లలు ఎక్కకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. 9. నిమజ్జనం సందర్భంగా పోలీసులు, ఇతర శాఖల సిబ్బందికి నిర్వాహకులు పూర్తిగా సహకరించాలి. 10.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే లేదా అవాంఛనీయ ఘటనలకు దారితీసే చర్యలకు పాల్పడకుండా సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలి.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఏసీపీ ఎం.రమేష్ కోరారు.

# మీసేవ నిర్వాహకుడి లీలలు

### -కాబోయే వరుడికి యువతి ఫోటోలు, వీడియోలు



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 18 :** మీ సేవలో పనిచేస్తున్న ఓ యువతి ఫోటోలు నిర్వాహకుడు తీసి తను చేసుకోబోయే వరునికి ఫోటోలతో పాటు వీడియోలు పంపిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన వరుస శ్రీనివాస్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో విశ్వం మీసేవ నిర్వహిస్తున్నాడు. వరుస శ్రీనివాస్‌పై ఓ యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి ఇటీవల వివాహం నిశ్చయమై, నిశ్చితార్థం కూడా జరిగినట్లు తెలిసింది.అయితే సదరు యువతితో కలిసి గతంలో దిగిన ఫొటోలు, వీడియోలను మీసేవ నిర్వాహకుడు కాబోయే వరుడికి పంపించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం కాబోయే వరుడి ద్వారా యువతి కుటుంబ సభ్యుల దృష్టికి రావడంతో వారు ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ ఘటనపై ఎస్సై రమేష్ ను ఫోన్‌లో సంప్రదించగా ఫిర్యాదు అందిన విషయాన్ని ధ్రువీకరించారు.దీంతో నిశ్చితార్థము క్యాన్సల్ అయినట్లు కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం,అతనికి వివాహమైంది భార్య ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలుస్తోంది, పోలీసులు కేసు నమోదు చేసుకొని మీసేవ కేంద్రాన్ని శుక్రవారం రాత్రి సీజ్ చేసినట్లు సమాచారం వరుస శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం రాత్రి రిమాండ్ చేశారు.

# మారుతీనగర్ మహాగణపతిని దర్శించుకున్న సీపీ గౌష్ ఆలం

### -ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్



**చురకలు ప్రతినిధి,హుజురాబాద్ ,సెప్టెంబర్ 18 :** హుజురాబాద్ పట్టణంలోని మారుతీనగర్ లో ఏర్పాటు చేసిన మహాగణపతిని కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు రాకేష్ శర్మ వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందించారు. మహాగణపతిని దర్శించుకున్న సీపీ గౌష్ ఆలంను గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ..గణపతి మండపం వద్ద చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.నిమజ్జనంలో ఎలాంటి అవరోధాలు లేకుండా నిర్వహించాలని సభ్యులకు సూచించారు.పోలీస్‌శాఖ వారు అందించే సూచనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ వీ మాధవి,టౌన్ సీఐ టీ కరుణాకర్,రూరల్ సీఐ వీ శ్రీనివాస్,కౌన్సిలర్ తాళ్లపెల్లి రమేష్, నాయకులు నల్ల సుమన్,నల్ల బాలరాజు నిర్వాహకులు వినయ్,సతీష్, శ్రీనివాస్,శ్రీకాంత్,నరేష్,వరప్రసాద్, నవీన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన కలెక్టర్

**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 18 :** సైదాపూర్ మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు నాలుగు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న సుమారు 24 ఎకరాల భూమి వివరాలను పరిశీలించిన కలెక్టర్.. భూమి ప్రస్తుత పరిస్థితి, వినియోగం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సైదాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌ను అడిగి భూమికి సంబంధించిన పలు వివరాలను తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ భూమి ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉందా? అనే అంశంపై క్షేత్రస్థాయి పరిస్థితులను కలెక్టర్ పర్యవేక్షించారు. భూమికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను పరిశీలించి సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు ఏర్పాట్లు షురూ

**కేంద్ర మంత్రి సూచన మేరకు హంగు ఆర్భాటాలతో ఉత్సవాల నిర్వహణ**
**-గతేడాది కంటే రెట్టింపు బడ్జెట్ కేటాయింపు**
**-తొలిసారి మున్సిపల్ కార్పొరేషన్‌లో వినాయకుడి ప్రతిష్ట**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 18 :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈసారి గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు ఘనమైన ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ను కోరారు. ఈరోజు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కరీంనగర్ లోని సీతారాంపూర్, ఆరెపల్లి,మెహర్ నగర్,వావిలాలపల్లి,ప్రశాంత్ నగర్, ఆదర్శనగర్, డాక్టర్స్ స్ట్రీట్, అశోక్ నగర్, చైతన్యపురి, మర్వాడీ మందిర్, కోతిరాంపూర్ ప్రాంతాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటించారు. ఆయా కాలనీల్లో కొలువైన గణనాథులను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాల ఏర్పాట్లపై మేయర్, డిప్యూటీ మేయర్ తో చర్చించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించినందున ప్రజల ఆకాంక్షల మేరకు గతం కంటే ఘనంగా నిమజ్జన ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా అధ్యాత్మిక వాతావరణంలో ఉత్సాహంగా నిమజ్జనం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కేంద్ర మంత్రి సూచనల మేరకు గతం కంటే ఘనంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాల ఏర్పాట్లను చేసేందుకు నగర పాలక సంస్థ సిద్ధమైంది. గతేడాది ఉత్సవాల నిర్వహణ కోసం రూ.70 లక్షలు మాత్రమే కేటాయించగా, ఈసారి నిమజ్జన ఉత్సవాల నిర్వహణ కోసం ఏకంగా కోటిన్నర రూపాయలు కేటాయించారు. దీనికి అదనంగా నగరం మొత్తాన్ని పూలతో, వివిధ రూపాల్లో అందంగా అలంకరణ చేసేందుకు సిద్ధమయ్యారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు అందంగా ముస్తాబు చేయాలని నిర్ణయించారు.నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఇబ్బంది లేకుండా మంచినీళ్లు, ప్రసాదాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. రోడ్లు అక్కడక్కడా గుంతలమయమై నిమజ్జనానికి తరలివెళ్లే గణనాథుడి వాహనాలకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదమున్నందున, యుద్ధ ప్రాతిపదికన ప్యాచ్ వర్క్ చేస్తూ ఆయా ఇబ్బందులను తొలగించేందుకు పనులు ప్రారంభించారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో ఇంతరవకు గణనాథుడిని ప్రతిష్టించిన దాఖలాల్లేవు. బీజేపీ నూతన పాలకవర్గం కొలువైన తరువాత తొలిసారి కార్పొరేషన్ లో గణనాథుడిని ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తుండటం గమనార్హం.ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచనల మేరకు గతం కంటే ఘనంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాలను నిర్వహించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు. నిమజ్జన ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని, అందుకోసం ఖర్చుకు వెనుకాడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# వెదురే.. 'గ్రీన్ గోల్డ్'



**-వెదురు సాగును ప్రోత్సహించాలి**
**-అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి కరీంనగర్, సెప్టెంబర్ 18 :** పర్యావరణ పరిరక్షణ తో పాటు గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధిని అందించగల వెదురు సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కరీంనగర్ అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెదురును 'గ్రీన్ గోల్డ్'గా అభివర్ణించిన ఆయన.. వెదురు వృత్తిపై ఆధారపడిన మేదరి కులస్థులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా ప్రపంచ వెదురు దినోత్సవాన్ని కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించింది.వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి,డీఆర్ఓ,అదనపు కలెక్టర్ స్వామి,బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అనిల్ ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వెదురు సాగుతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు స్థిరమైన ఆదాయ మార్గాలు లభిస్తాయని పేర్కొన్నారు.తరతరాలుగా వెదురు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేదరి కులస్థులసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగాదృష్టి సారిస్తుందని తెలిపారు.ప్రపంచ వెదురు సంస్థ 2009 నుంచి ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. సుస్థిర అభివృద్ధి,పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పనలో వెదురుకు ఉన్న ప్రాధాన్యతను వివరించడమే ఈ దినోత్సవం ఉద్దేశమని పేర్కొన్నారు.

**వృత్తి సమస్యలను అధికారుల దృష్టికి...**

కార్యక్రమానికి హాజరైన మేదరి కుల ప్రతినిధులు తమ వృత్తి ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెదురు లభ్యత, వృత్తి పరిరక్షణ, ఉపాధి అవకాశాలు, వెదురు ఉత్పత్తులకు మార్కెటింగ్ తదితర అంశాలపై తమ సమస్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో మేదరి కుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతల మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షుడు అలిపిరెడ్డి చంద్రమౌళి, బొల్లం రామస్వామి, ఎనుగందుల రమేష్, బొమ్మిడి వేణుగోపాల్, బొల్లం నారాయణ, మొలుగూరి రవీందర్, అలిపిరెడ్డి రామస్వామి, మొగులూరి రాజ్ కుమార్, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**-రామగిరి మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించిన జిల్లా కలెక్టర్**




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (రామగిరి), సెప్టెంబర్ 18 :** ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.రామగిరి మండలంలోని ఎంపీడీవో కార్యాలయం లో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని వివిధశాఖల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా వ్యవసాయం,విద్య, ఉద్యానవనం, తాగునీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మండలం లో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 809.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన నేపథ్యంలో సాగు పరిస్థితుల ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వానాకాలం 2026లో మండలంలో 12,467 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసినందున రైతులకు అవసరమైన వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు.మండలంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 119.2 మెట్రిక్ టన్నుల యూరియా, 45.5 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 24 మెట్రిక్ టన్నుల ఎంపీ నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి**

మండలంలో డిజిటల్ క్రాప్ సర్వే 52.63శాతం పూర్తయినందున మిగిలిన సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.రైతు వాలంటీర్ల సహకారంతో ప్రతి రైతు సంబంధించిన పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని,సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెంచాలి**

బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా 250 మంది విద్యార్థులు చేరిన నేపథ్యంలో మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో కొత్తగా ప్రారంభించిన 9 ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న రెండు జతల యూనిఫారాలు, షూలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు.ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఉపాధ్యాయులు,విద్యార్థుల హాజరు నమోదును పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆదేశించారు.గత ఎస్ఎస్‌సీ పరీక్షల్లో కేజీబీవీలో 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 161 మంది ఉత్తీర్ణులైన నేపథ్యంలో విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించి మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని 7పాఠశాలల్లో ఏఐ ఆధారిత విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థులకు టిఫిన్,పాలు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

**ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి**

2026-27 సంవత్సరానికి జిల్లాకు కేటాయించిన 1,150ఎకరాల ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని సాధించేలా మండలంలో ఆసక్తి ఉన్న రైతులను గుర్తించాలని ఆదేశించారు.ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతులకువిస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఎకరానికి 57 మొక్కలను 9ఐ9 మీటర్ల దూరంలో నాటేలా రైతులకు అవగాహన కల్పించాలని ,అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రాయితీలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలం లో ఇప్పటికే 60 మంది రైతులు 171 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టినందున మరింత మంది రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

**మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పించాలి**

బిందు, తుంపర సేద్య పథకం ద్వారా తక్కువ నీటితో అధిక ఉత్పత్తి సాధించేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.రైతుల కేటగిరీ ఆధారంగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి**

మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిం చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్పంచులు గత సమావేశాల్లో ప్రస్తా వించిన సమస్యలపై రూపొందించిన అంచనాలు, పంపిన ప్రతిపాదనల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనాథ్, డిప్యూటీ సీఈవో సంజీవ రావు, డీఎల్పీఓ కొమురయ్య , ఎంపీడీవో శైలజా రాణి, తహసీల్దార్ సుమన్, గ్రామాల సర్పంచ్ లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నామస్మరణతో ప్రతిధ్వనించిన "కొత్తగట్టు"

**-నవరాత్రి ఉత్సవాల వద్ద అన్నదాన కార్యక్రమం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 18 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామం శుక్రవారం గణేష్ నామస్మరణతో ప్రతిధ్వనించింది. బిఆర్ఎస్ మండల నాయకుడు పూదరి నరేష్ ఆధ్వర్యంలో దుబ్బవాడలో గణేష నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు భజనలు నిర్వహించారు. గణేశ ప్రతిమకు ప్రత్యేక అలంకరణలు చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా చేసిన పూజా కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. భక్తులు గ్రామ ప్రజలు భక్తి పారవశ్యంతో భజనలు చేశారు. ఈ సందర్భంగా పూదరి నరేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్తులకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రేమిడి సంపత్ రెడ్డి, పూదరి తిరుపతి, పూదరి రాజు, కత్తెర మల్ల కుమార్, మునిగంటి శ్రీనివాస్ ఏరుకొండ రాజు, గరిగె రవి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.